దేశాభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర

వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ



కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మ

కడప ఎడ్యుకేషన్: దేశాభివృద్ధిలో మహిళలు చాలా కీలక పాత్ర పోషిస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకొని నేటితరం విద్యార్థులు రాణించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ పిలుపునిచ్చారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాల్లో వైవీయూ ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' ఎక్సెలరేట్ యాక్షన్ అనే థీమ్‌తో మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి సభకు అధ్యక్షత వహించగా గౌరవ అతిథిగా హాజరైన ఆచార్య పుత్తా పద్మా మాట్లాడుతూ పురుషులతో సమానంగా సమర్థవంతంగా పనిచేస్తున్న మహిళలందరినీ అభినందించారు. విద్య, ఆరోగ్యం, ఐటీ, పరిశోధన, అంతరిక్ష రంగాల వంటి అన్ని రంగాల్లో మహిళలు అత్యంత సమర్థవంతంగా రాణిస్తున్నారని ఉదహరించారు. మహిళలు తమ ఆకాంక్షల మేరకు సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ ఆరోగ్యం, బాధ్యతలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. శక్తివంతమైన మహిళలు బలమైన దేశాన్ని తయారు చేస్తారన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో మహిళలు రాణించలేని రంగం అంటూ లేదని తెలిపారు. విద్యార్థినిలు అత్యున్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఈ దేశ ఔన్నత్యాన్ని పెంచేలా తయారు కావాలన్నారు. గౌరవ అతిథి, ఆంధ్ర ప్రదేశ్ సంగీత నృత్య అకాడమీ సభ్యురాలు, సుమాంజలి కూచిపూడి నాట్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ కోడూరు సుమన శ్రీ మాట్లాడుతూ కవయత్రి మొల్ల, సావిత్రీబాయి పూలేలను స్మరించుకునే రోజు ఇది. మహిళలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నేటి సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రత్యేక అతిథి విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నేటితరం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా పలు విభాగాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన వారికి అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం–2025 కోసం సమిష్టిగా ×యాక్సిలరేట్ యాక్షన్‌పై మహిళా సెల్ కన్వీనర్ ఆచార్య విజయలక్ష్మి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. మహిళా దినోత్సవం సందర్భంగా వైవీయూ ఫైన్ ఆర్ట్ శాఖ గీసిన చిత్రాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైవీయూ ఉమెన్ సెల్ కన్వీనర్ ఆచార్య విజయలక్ష్మి, సభ్యులు ప్రొఫెసర్ మాధవి, సహ ఆచార్యులు డాక్టర్ అనూ ప్రసన్న, డాక్టర్ ఉస్మాన్ బాష, ఖాజా, సుమలత, విద్యార్థులు అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



రోడ్డు భద్రత నియమాలు తెలియజేస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : బస్సులను నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కడప ట్రాఫిక్ సీఐ డీకే జావిద్ తెలిపారు. మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సమావేశపు హాలులో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న, ఫిర్యాదులు వస్తున్న డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీకి ప్రమాద రహిత సంస్థగా గుర్తింపు ఉందన్నారు. ఆ పేరు నిలబెట్టేందుకు డ్రైవర్లు నిరంతరం కృషి చేయాలన్నారు. విధి నిర్వహణ సమయంలో చిన్న పాటి పొరపాటుకు కూడా తావు లేకుండా ప్రయాణీకులను క్షేమకరంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు రోడ్డు భద్రతపై సూచనలు చేశారు. ప్రతి డ్రైవరు ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప జోన్ పరిధిలోని వివిధ డిపోలకు చెందిన 20 మంది డ్రైవర్లు, అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. కాపాడు తల్లీ..!



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈనెల 14న పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి సన్నిధిలో హోమం, దీపాలంకార సేవ తదితర విశేష పూజలు నిర్వహించనున్నామని వారు తెలిపారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఆచార్య పుత్తా పద్మ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. యోగివేమన విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవంలో భాగంగా మంగళవారం జాతీయ సేవా పథకం–9, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (రిమ్స్ –కడప) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం వైవీయూ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రధాన ఆచార్యులు ఎస్. రఘునాథ రెడ్డి, కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుల సచివులు ఆచార్య పద్మ రక్తదానం చేసి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. 75 యూనిట్ల రక్తం వాలంటీర్స్ స్వచ్ఛందంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రాజేంద్ర, విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డా . ఎన్. వెంకట్రామిరెడ్డి , జాతీయ సేవా పథకం–9 ప్రోగ్రాం ఆఫీసర్ డా . కె. శ్రీనివాసరావు , విశ్వవిద్యాలయ డాక్టర్ నరేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మొల్లమాంబ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న హనుమంతరావు

కడప కల్చరల్ : తొలి తెలుగు రామాయణ రచయిత్రి మొల్లమాంబ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని కోరారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఆయనను కలిసి హనుమంతరావు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. మొల్ల జయంతిని ప్రభుత్వమే పండుగలా నిర్వహించాలని, ఆమె ఘనతను చాటాలన్నారు. మొల్లమాంబ జయంతిని యేటా ఆమె జన్మదినమైన మార్చి 13న నిర్వహిస్తున్నామని, దాన్ని ప్రభుత్వ పరంగా నిర్వహించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు కూడా ఇచ్చిందన్నారు. కనుక ప్రభుత్వం ఈ మేరకు ఉత్సవాన్ని నిర్వహించాలని కోరారు.

రేపు విజయవాడ నుంచి కడపకు ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగియనున్న తరుణంలో ఈనెల 13న విజయవాడ నుంచి కడపకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు బద్వేలు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నుంచి కడపకు (సర్వీస్ నెం 95467) సాయంత్రం 7.30 గంటలకు, మరో బస్సు (సర్వీసు నెంబరు 95283) రాత్రి 8.00 గంటలకు, (సర్వీస్ నెం. 95350) ఇంకో బస్సు రాత్రి 8.30 గంటలకు బయలుదేరుతాయన్నారు. ఈ బస్సులకు బద్వేల్ రిజర్వేషన్ కౌంటర్ నుంచి రిజర్వేషన్ చేసుకొనే సౌకర్యం కల్పించామని వివరించారు. విజయవాడ నుంచి కడపకు రిజర్వేషన్ కావలసిన వారు బద్వేలు రిజర్వేషన్ కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే 8886090136 నెంబరులో భాస్కర్‌ను సంప్రదించి ఇదే ఫోన్ పే నెంబరు నెంబరు ద్వారా నగదును చెల్లించి టిక్కెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చని వివరించారు. ఇతర వివరాలకు డిపో మేనేజర్ ఫోన్ నెంబరు 99592 25779లో సంప్రదించాలన్నారు.

16న జీఓసీ టీఏఎస్‌ఏ ఆర్మీ సమావేశం

కడప రూరల్: కడప జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో జీఓసీ (జనరల్ ఆఫీసర్ కమాండింగ్) టీఏఎస్‌ఏ (తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా) ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన నిర్వహించే ర్యాలీ, సమావేశానికి మాజీ సైనికులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ఎడ్ ఫిలిప్స్ తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. మాజీ సైనికులు కుటుంబ సభ్యుల భూమి, ఇంటి స్థలం, పెన్షన్, సీఎస్‌డీ క్యాంటీన్, స్పార్స్ పెన్షన్, ఈసీహెచ్‌ఎస్ కార్డ్స్ మొదలగు సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఈసీహెచ్‌ఎస్, మెడికల్ క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు.

తెల్లదోమను నివారించాలి

కమలాపురం : వేసవిలో సాగు చేసిన నువ్వుల పంటకు తెల్లదోమ ఆశించిందని, ఈ తెల్లదోమను నివారించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో వేసవిలో సాగు చేసిన నువ్వుల పంటను ఆయన పరిశీలించారు. ఈ పంటకు తెల్లదోమ ఆశించిందని రైతులకు సూచించారు. అలాగే వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వలన రసం పీల్చే పురుగుల ఉధృతి కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. రసం పీల్చే పురుగుల నివారణ కూడా కచ్చితంగా చేపట్టాలన్నారు. పంటలో తెల్లదోమను నివారించడానికి ఏకరాకు 15–20 వరకు పసుపు రంగు జిగురు అట్టలను అమర్చాలన్నారు. అలాగే రసం పీల్చే పురుగు నివారణకు డయా ఫెన్తురియన్ 1.25 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. లేని పక్షంలో స్పైరో మెసిఫిన్ (ఒబెరాన్) 1 మి.లీ. నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీపీఏ బాబు, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటు భాగస్వామ్యం పేరుతో వైద్య కళాశాలల విక్రయం



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యం పేరిట వైద్య కళాశాలలను అమ్మేస్తోందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.వలరాజు విమర్శించారు. మంగళవారం రిమ్స్‌లో ఏఐఎస్‌ఎఫ్ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం కోరిక మేరకు ప్రభుత్వం రంగంలో నడపడానికి 17 మెడికల్ కళాశాలలను నేషనల్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసిందన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హామీల్లో భాగంగా నాటి ప్రభుత్వం మొదటి విడతలో ఐదు మెడికల్ కళాశాలల నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించిందన్నారు. అలాగే రెండవ విడతలో పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లను ఎన్‌ఎంసీ కేటాయించిందన్నారు అయితే నేటి కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా ఎన్‌ఎంసీకి లేఖ రాయడం వల్ల 150 సీట్లు విద్యార్థులు కోల్పోయారని తెలిపారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు జీఓ నెంబరు 107, 108లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పీ4 పద్ధతిలో మెడికల్ కళాశాలలన్నింటినీ ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసిందని, ఇందువల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోతుందని తెలిపారు. తక్షణమే ఈ పద్ధతిని ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శివశంకర్, నగర కార్యదర్శి తేజ, జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, చంద్ర, బాలాజీ, భరత్, వంశీ, గంగాధర్ పాల్గొన్నారు.

వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం



సాసర్ పిట్‌లలో నీటిని నింపుతున్న అటవీ సిబ్బంది

సిద్దవటం: వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని సిద్దవటం రేంజిలోని అటవీ పరిసరాల్లో వన్యప్రాణులకు, అడవి జంతువులు తాగునీటి సౌకర్యాలను కల్పించామని రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో వన్యప్రాణులు, అటవీ జంతువులు తాగు నీటి కోసం గ్రామాల్లోకి రాకుండా కడప డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు అటవీ ప్రాంతాల్లోని సాసర్ పీట్లతో పాటుగా, పలు నీటి కుంటల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. గ్రామాల్లోకి వన్యప్రాణులు, జంతువులు వస్తే ప్రజలు వాటికి ఎలాంటి ప్రాణహాని తలపెట్టవద్దని, అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అటవీ జంతువులకు హాని తలపెట్టినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేసు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నూనె గింజల పంటలతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న కడప ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: నూనె గింజల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప మండల పరిధిలోని నానపల్లెలో జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా రైతులకు నూనెగింజల సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా నూనె గింజల పంటలను సాగు చేసుకుంటే అధిక ఆదాయం పొందవచ్చన్నారు. యాంత్రీకరణ పథకంలో భాగంగా కడప మండలానికి 17 పవర్ స్ప్రేయర్లు, 20 ట్రాక్టర్ మడకలు, 6 న్యాప్‌సాక్ స్ప్రేయర్లు, సబ్సిడీపై మంజూరైనట్లు తెలిపారు. ఈ పనిముట్లకు ఈనెల 15వ తేదీలోపల వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయితే దరఖాస్తు చేసుకొనుటకు ఐదు సంవత్సరాల నుంచి పంట నమోదు ఖచ్చితంగా చేసుకుని ఉండి ట్రాక్టర్ ఆర్సీ, పట్టాదారు పుస్తకం కలిగి ఉండి చిన్న, సన్నకారు రైతులకు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కమలాపురం : ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్‌డీ కెజియా తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దచెప్పలిలో ప్రజలకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ప్రోగ్రాంపై ఇంటింటికి వెళ్లి శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే ప్రజలందరూ తమ ఇళ్లలోని చెత్తను పంచాయతీ సిబ్బందికి తడి పొడి చెత్తను వేరు వేరుగా అందించాలన్నారు. ఇప్పటికే పంచాయతీ సిబ్బంది మీకు రెండు రంగుల డస్ట్‌బిన్‌లు అందించారని ఆమె గుర్తు చేశారు. ఆ డస్ట్‌బిన్‌లలో మీ ఇంటి వద్దకు వచ్చిన హరిత రాయబారులకు అందించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. ఎవరి ఇంటి పరిసరాలు వారు శుభ్రం చేసుకుంటే గ్రామం అంతా పరిశుభ్రంగా ఉంటుందన్నారు. గ్రామంలో 3 వేలకు పైగా జనాభా ఉన్నారని, ప్రతి ఒక్కరూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పెంచలయ్య, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలి

కమలాపురం : మండలంలోని అన్ని ఆర్‌ఎస్‌కేలలో పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శనకు ఉంచామని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం చిన్నచెప్పలిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట సాగు చేసి ఇ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాల జాబితాలను అన్ని ఆర్‌ఎస్‌కేలలో ప్రదర్శనకు ఉంచామన్నారు. ఈనెల 18వ తేదీ వరకు జాబితా ప్రదర్శన ఉంటుందని, అందులో ఎలాంటి లోపాలు ఉన్నా 18 తర్వాత ఫిర్యాదు చేయాలని ఆమె రైతులకు సూచించారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు ప్రత్యేక విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ పంట రుణాలు, వ్యవసాయ పరికరాలు, ఇన్సూరెన్స్ వంటి పథకాలు అమలు కావాలంటే తప్పని సరిగా ఈ విశిష్ట సంఖ్య అవసరం అన్నారు. అలాగే పంట దిగుబడులు విక్రయించుకోవాలనుకునే రైతులు ముందుగా సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మినుము క్వింటా ధర రూ.7400గా నిర్ణయించిందని, శనగ రూ.5650, కందులు రూ.7550 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని ఆమె వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పొంచి ఉన్న ముప్పు

కడప నగర పాలక సంస్థ పరిధిలో ఆర్టీసీ బస్టాండు అవుట్‌గేట్–అంబేడ్కర్ సర్కిల్ మధ్యలో ఓ మ్యాన్‌హోల్ ఐరన్ ప్లేట్ విరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. ప్రజలు ఆదమరిచి ఆ దారిన వెళితే అంతే సంగతులు.. రాత్రి వేళల్లో ఈ దారిన వచ్చే వాళ్లు చాలా అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే ప్రమాదానికి గురికాక తప్పదు. అధికారులు ఈ సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



చెట్టు నీడన కాసేపు..

రోజు రోజుకూ ఎండలు పెరిగిపోతున్నాయి. ఇక మధ్యాహ్నం అయితే మరీ ఎక్కువగా ఉంటున్నాయి. వివిధ పనుల నిమిత్తం తిరిగే ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక పోతున్నారు. ఎక్కడైనా కాస్త నీడ ఉన్న చెట్లు కనిపిస్తే చాలు అక్కడ కాసేపు సేదదీరి మళ్లీ వెళుతున్నారు. ద్విచక్ర వాహనదారులు కూడా కాసేపు చెట్ల నీడన ఉంటున్నారు. ఈ చిత్రం కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోనిది.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

విద్యా సామగ్రి పంపిణీ

చింతకొమ్మదిన్నె : పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించి జీవితంలో స్థిరపడటానికి మార్గం ఏర్పాటు చేసుకోవాలని ఎంఈఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం మండలంలోని మూలవంక జిల్లా పరిషత్ ఉర్దు ఉన్నత పాఠశాలలో గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి ఎంఈఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు కల్చరల్: అవయవదానంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కొవ్వూరు గ్రాండ్ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తనకు కాలేయ మార్పిడి జరిగి 23 ఏళ్లు అయిన సందర్భంగా 250 మంది రోగులకు మంగళవారం బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లో తనకు కాలేయం సమస్య రావడంతో స్వప్న అనే యువతి అవయవదానం చేసిందన్నారు. చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అవయవమార్పిడి అవసరమైన వారికి తన వంతు సహకారంగా రూ.50 వేలు అందిస్తానన్నారు.


కలల సాకారానికి శ్రమించాలి



యువ జాగృతిలో పాల్గొన్న విద్యార్థులు (ఇన్‌సెట్) విద్యార్థులకు సందేశం ఇస్తున్న స్వామి అనుపమానంద

రాజంపేట రూరల్ : కలల సాకారానికి యువత నిరంతరం శ్రమించాలని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనుపమానందజీ మహరాజ్ విద్యార్థులకు సూచించారు. స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో మంగళవారం ఏయూ, రామకృష్ణ మఠం సంయుక్తంగా 'యువ జాగృతి' వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనుపమానంద ద్వితీయ సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెంపొందించేలా, నైతిక విలువలను అలవర్చుకునేలా, సమాజానికి ఉపయుక్తమైన జ్ఞానాన్ని పొందేందుకు ఎలాంటి సూత్రాలు పాటించాలో వివరించారు. విద్యార్థులు స్వామి వివేకానంద ఆశయాలను కొనసాగించాలన్నారు. విద్య కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా అది వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా ఉండాలన్నారు. నిజమైన విజయం మన ఆచరణలో ప్రతిఫలించాలనే తత్వాన్ని యువత అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఏయూ ఉపకులపతి డాక్టర్ ఇ.సాయిబాబారెడ్డి, ఈవెంట్ కో–ఆర్డినేటర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, ఆలమ్ని కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.ప్రసాద్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

యాలివాహనంపై శ్రీనివాసుడు



బద్వేల్ అర్బన్: మండలంలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజున మంగళవారం స్వామి యాలివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయ కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయంలో ఉంచి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ రామలింగారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, శ్రావణ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

NEET SHORT TERM
CLASSES FROM 19-03-2025
Unbelievable Price Rs. 9999/-
Admission Started Cell: 9966296467
LAKSHMI IIT NEET ACADEMY
Rajiv Park Road, Near Siva Shivani School, Kadapa